సాక్షి
చిత్తూరు
గురువారం । 25 । జనవరి । 2024



విజయవంతంగా వికసిత్ భారత్ యాత్ర

జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ పరిశీలకులు తెలిపారు. - 10లో



కూలీలకోసం వెళ్తూ..

పొలంలో వరినాట్లు వేయడానికి కూలీలను పిలిచేందుకు వెళ్తూ ఓ రైతు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. - 10లో



ఇంటి స్థలాల పంపిణీపై కసరత్తు

జిల్లాలోని జర్నలిస్టులకు ఇంటి పట్టాల పంపిణీ కసరత్తును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 10లో

న్యూస్‌రీల్

సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు



సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు

నగరి : తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 16వ తేదీ జరుగుతాయని ఎన్నికల సంఘం ప్రతిపాదిత తేదీని ప్రకటించడం, మన రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో రెండు రాష్ట్రాల సరిహద్దు వద్ద ఇరురాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా బుధవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. తిరువళ్లూరు జిల్లా, చిత్తూరు జిల్లాల ఎస్పీల ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్, తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ తమిళమారన్ ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు పొన్‌పాడి ప్రాంతానికి వెళ్లి చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా సరిహద్దు వద్ద పోలీసు గస్తీ, వాహనాల తనిఖీలు ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు మార్టిన్ ప్రేమ్‌రాజ్, ఎస్‌ఐ. రాకీకుమారి, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



పరీక్ష రాసేందుకు విచ్చేసిన విద్యార్థిని బయోమెట్రిక్ తీసుకుంటున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో తొలిరోజు నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని సిటీ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులు సమయానికి హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. మొదటి రోజు పరీక్షకు 26 మందికిగానూ 21 మంది రాసినట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించామని ఆయన తెలిపారు.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్వామివారి సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలన్నారు.

27 లోపు కమిటీల నియామకాలు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన పలు కమిటీల ప్రక్రియను ఈ నెల 27వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆర్‌ఓ, ఈఆర్‌ఓ, పలువురు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కమిటీల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టేట్ సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్ తదితర కమిటీల నియామకాలను ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అమలు చేసేందుకు జిల్లాలో, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎంసీఎంసీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టేట్ సర్వేలైన్స్ టీంలో మండల మెజిస్ట్రేట్, ముగ్గురు పోలీసులతో 3 బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 1762 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో పనులు పూర్తి చేసి 27వ తేదీలోపు ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, రోజా, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

సాదర స్వాగతం



రేణిగుంట ఎయిర్‌పోర్టులో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు, పూతలపట్టు నియోజక వర్గాల ఇన్‌చార్జ్‌లు విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి

- ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు హాజరైన సీఎం వైఎస్ జగన్
- రేణిగుంట ఎయిర్‌పోర్టులో ఘనంగా ఆహ్వానం పలికిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, తిరుపతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతిలో నిర్వహించిన ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు హాజరయ్యారు. ఈ మేరకు సాయంత్రం 4.30 గంటలకు ఆయన ప్రత్యేక విమానంలో రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి రోడ్డు మార్గంలో తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌కు చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. తిరిగి రోడ్డు మార్గంలో రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరానికి పయనమయ్యారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం, కె.శ్రీనివాసులు, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి కార్పొరేషన్ మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రిశాంత్‌రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,665 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,630 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఐదు చోట్ల సురక్ష శిబిరాలు

చిత్తూరు రూరల్: జిల్లావ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 2,376 మంది చికిత్స చేయించుకున్నారు. ఇందులో జనరల్ ఓపీకి 1,134 మంది, గైనిక్‌కు 280, చిన్నపిల్లల సేవలకు 150, ఆర్థోకు 418, డెంటల్ 39, చర్మం 114, కంటి సమస్యలు 170, ఇతర సేవలకు 71 మంది వచ్చారు. 19 మందికి అద్దాలు పంపిణీ చేశారు.

వన్నెకుల క్షత్రియుల

కల నెరవేర్చాం



వన్నెకుల క్షత్రియ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- టీడీపీ హయాంలో మొండి గోడలకే పరిమితమైన భవన నిర్మాణం
- రూ.5 కోట్లతో వన్నెకుల క్షత్రియ భవనం నిర్మించాం
- మీకు ఇంత మంచి చేస్తున్న భరత్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించండి
- మంత్రి పెద్దిరెడ్డి

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో అధికంగా ఉన్న వన్నెకుల క్షత్రియుల ఏళ్ల తరబడి కలగా మిగిలిన భవనాన్ని పూర్తి చేసి వారి కల నెరవేర్చామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం గుడుపల్లె మండలం గుత్తార్లపల్లి వద్ద నూతనంగా నిర్మించినా వన్నెకుల క్షత్రియ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మట్టిగోడలకే పరిమితమైన వన్నెలకు క్షత్రియ భవనాన్ని, సుమారు రూ.5 కోట్లతో ఎమ్మెల్సీ భరత్ పట్టుబట్టి పూర్తి చేయించారని తెలిపారు. వన్నెకుల క్షత్రియుల కల నెరవేర్చిన భరత్‌కు వచ్చే ఎన్నికల్లో మీరంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లతో వన్నెకుల క్షత్రియ భవనం నిర్మిస్తున్నట్లు టీడీపీ నాయకులు చెప్పి కుప్పం ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వన్నెకుల క్షత్రియ భవనం పూర్తి కోసం భరత్ చొరవ తీసుకున్నారని, మీ కోసం ఎంతగానో తాపత్రయ పడుతున్న అతన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

గుడుపల్లె మండలం సోడిగానిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు గోవిందప్ప గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గోవిందప్పకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవిందప్ప మృతి బాధాకరమన్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని మంత్రి పెద్దిరెడ్డి వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ రాష్ట్ర వన్నెకుల చైర్మన్ వనిత, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వన్నెకుల క్షత్రియ నాయకులు మురుగేష్, సీపీ మనోహర్, మునిరత్నం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందమని పింఛన్



ఇచ్చిన మాట తప్పడు.. చెప్పిన ప్రతి సంక్షేమ పథకం అందించి నిరుపేదల పాలిట దేవుడు.. మడమతిప్పని నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి లబ్ధిదారుడి నోటి వెంట వస్తున్న మాటలివి.. చంద్రబాబు పదవి నుంచి దిగిపోతూ రాష్ట్రాన్ని అప్పుల సుడిగుండంలో నెట్టివెళ్లినా.. కరోనా మహమ్మారితో ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైనా మొక్కవోని దీక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ముఖ్యంగా సామాజిక భద్రత పింఛన్ రూ.3 వేలు అందిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. ఇంత మంచి చేస్తున్న సీఎం జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటామని లబ్ధిదారులు ఆనందంగా చెబుతున్నారు.

- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్
- రూ.3 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం
- 2014–15లో టీడీపీ ఇచ్చింది రూ.1000 మాత్రమే
- ప్రతి మూడు నెలలకోసారి అర్హులకు కొత్త పింఛన్ల మంజూరు చేస్తున్న ప్రభుత్వం
- ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్
- మళ్లీ జగనే సీఎం కావాలంటున్న లబ్ధిదారులు



గుడిపాల : వృద్ధులకు ఇంటి వద్దే పింఛను అందజేస్తున్న వలంటీర్

చిత్తూరు అగ్రికల్చర్: పండుటాకుల మోములో చిరునవ్వు కనిపిస్తోంది.. బతుక్కి భరోసా లేని ఒంటరి మహిళలు, వితంతువులు ఆనందంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.. కష్టాల సుడిగుండంలో చిక్కి శల్యమవుతున్న కల్లుగీత, చేనేత కార్మికుల కళ్లలో ఆనంద బాష్పాలు.. కిడ్నీ వ్యాధితో బాధపడే రోగులు సంతోషంగా కాలం వెల్లదీస్తున్నారు.. వీరి ఆనందానికి కారణం సీఎం జగన్‌మోహన్‌రెడ్డే అని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ జనవరి నుంచి వీరికి రూ.3 వేలు చొప్పున పింఛన్ అందుతోంది. చిత్తూరు నియోజకవర్గంలో సామాజిక పింఛనుదారులకు రూ.3 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల వరకు పింఛన్ తీసుకుంటున్నారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో గత ఏడాది డిసెంబరు వరకు 28,665 మందికి రూ.8,49,31,000 నగదు పంపిణీ చేస్తుండగా, ఈ జనవరి నుంచి మరో 378 మంది కొత్తగా జాబితాలో చేరారు. దీంతో నియోజకవర్గ పరిధిలో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 29,043కు చేరగా, పింఛన్ మొత్తం రూ.8,60,65,000 పంపిణీ చేశారు.

నాడు నరకం.. నేడు సులభం..

గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌కు అర్హత సాధించాలంటే నరకయాతన తప్పేది కాదు. పింఛన్ కోసం స్థానిక టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే గానీ వచ్చేది కాదు. తీరా పింఛన్ వచ్చాక ప్రతి నెలా పింఛన్ మొత్తం తీసుకోవాడానికి పండుటాకులు పడే బాధలు అన్నీఇన్నీ కావు. రోజుల తరబడి వ్యయప్రయాసలకు ఓర్చి పడిగాపులు కాయాల్సిన దుస్థితి. దీంతో పింఛన్ మొత్తం సగం డబ్బులు ఆటోలకే సరిపోయేవి.

నేడు గౌరవంగా పింఛన్...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందిస్తున్నారు. అంతేగాక ఇతర ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా నేరుగా వలంటీర్లు పింఛన్ల మొత్తాలను అందజేస్తున్నారు. ఎవరైనా కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా అందుబాటులో ఉండే వలంటీరుకు తెలియజేస్తే కేవలం రోజుల వ్యవధిలో పింఛన్ మంజూరవుతోంది. అర్హతకు కులం, మతం, పార్టీలు అన్న తారతమ్య భేదాలు లేకుండా సచివాలయ సిబ్బంది ద్వారా ఎంపిక చేస్తుండడంతో నిజమైన అర్హులకు న్యాయం జరుగుతోంది. అర్హులై ఉండి ఒకవేళ సాంకేతిక కారణం చేత పింఛను పొందని వారికి మరో అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఏటా జూన్, డిసెంబరులో కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పెన్షన్‌కార్డులు అందిస్తున్నారు.

చిత్తూరులో పింఛన్ వివరాలు..

2023 డిసెంబర్ నాటికి పింఛన్ తీసుకున్న వారు	28,665 మంది
పంపిణీ చేసిన నగదు	రూ.8,49,3,1000
కొత్తగా మంజూరైనవి	378
పంపిణీ చేసిన నగదు	రూ.11,34,000
మొత్తం లబ్ధిదారులు	29,043 మంది
పంపిణీ చేసిన నగదు	రూ.8,60,65,000
గత ప్రభుత్వ హయాంలో..	
2019 మే నెలలో లబ్ధిదారులు	23,972
పంపిణీచేసిన నగదు	రూ.5,07,52,000


మాకు ఎంతో మేలు..



పేదలైన మాకు ఈ వయసులో వచ్చే ఆర్థిక కష్టాలకు పింఛన్ సొమ్ము పెంచడంతో ఎంతో ఉపయోగ పడుతోంది. ఈ నెలలో రూ.3 వేల పింఛను అందుకున్నాను. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీ నిలబెట్టుకున్న గొప్ప సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన పాలనలో మాలాంటి అభాగ్యులకు ఆర్థిక భరోసా అందిస్తూ ఆదుకుంటున్నారు.

– రామకృష్ణారెడ్డి, వసంతాపురం


మనోధైర్యం ఇచ్చారు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని చెప్పిన మాట ప్రకారం పెంచి రూ.3 వేలు అందించడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా వలంటీర్లు పింఛను అందిస్తున్నారు. దీంతో డబ్బుల కోసం ఇతరులపై ఆధార పడాల్సిన పనిలేకుండా మనోధైర్యం ఇచ్చారు. జగనే మళ్లీ సీఎం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

– లక్ష్మి, నరహరిపేట

రాజన్న పాలన వచ్చింది



పింఛన్ల పెంపుదలపై జగన్ మొదటి సంతకంతోనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన మొదలైంది. అనారోగ్యంతో ఇతర ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా వలంటీర్లు వచ్చి పింఛను అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తున్న ఏకైక సీఎం జగన్.

– మునిలక్ష్మి, గుడిపాల

ఎప్పటికీ మరిచిపోం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఎప్పటికీ మరిచిపోం. అవ్వాతాతలు, అభాగ్యుల కష్టాలు నేరుగా తెలుసుకున్న ముఖ్యమంత్రి ఏటా పింఛన్ రూ.250 చొప్పున పెంచుతూ నేడు నెలకు రూ.3 వేలు అందిస్తున్నాడు. చాలా సంతోషంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారేసరికి వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అవ్వా ఇదిగో పింఛను అంటూ ఇస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది.

– అమ్ములు, నరహరిపేట

ఒక్క రోజులోనే పింఛన్..



నా భర్త గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి మా వివరాలు తీసుకున్నారు. ఒక్క రోజులోనే వితంతు పింఛను మంజూరు చేశారు. ఇప్పుడు పెరిగిన పింఛనుతో ఈ నెల రూ.3 వేలు అందుకున్నాను. మాలాంటి నిరుపేదలకు ఇంటి వద్దకే వచ్చి పింఛను మంజూరు చేసి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– నీలమ్మ, వసంతాపురం

ఎప్పటికీ రుణపడి ఉంటాం..



గత ప్రభుత్వ హయాంలో పింఛను తీసుకోవాలంటే ప్రతి నెలా అవస్థలు తప్పేవి కావు. అన్ని పనులు వదులుకుని పడిగాపులు కాచినా లాగిన్ పనిచేయకపోతే తిరిగి ఇంటికి రావాల్సిందే. వారం రోజులు తిరిగితే గానీ పింఛను చేతికి అందేది కాదు. ఇప్పుడు వలంటీర్లు నేరుగా ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి పింఛను అందిస్తున్నారు. ముఖ్యమంత్రికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఎలిజబెత్, బసవాపల్లె

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

- 13 మందికి జిల్లాస్థాయి అవార్డుల అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాకేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.45 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు గాంధీ సర్కిల్ వద్ద విద్యార్థులచే మానవహారం, 10 గంటలకు గాంధీ విగ్రహం నుంచి నాగయ్య కళాక్షేత్రం వరకు ఓటరు అవగాహన ర్యాలీ, 10.30 గంటలకు కళాక్షేత్రంలో కార్యకమం జ్యోతి ప్రజ్వలన, 10.30 గంటలకు ప్రార్థన, 10.45 గంటలకు కలెక్టర్ సందేశం, 11.45 గంటలకు ప్రతిజ్ఞ, సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం, కొత్త యువ ఓటర్లుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులు పంపిణీ, ఓటరు జాబితా తయారీలో విశేష కృషి చేసిన ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ, సూపర్‌వైజర్, బీఎల్‌ఓలు 13 మందికి అవార్డులు అందజేయనున్నారు.

13 మందికి అవార్డులు..

ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14 మందికి జిల్లాస్థాయి అవార్డులను అందజేయనున్నారు. నగరి ఈఆర్‌ఓ, ఆర్డీఓ సుజన, ఏఈఆర్‌ఓ, నగరపాలక కమిషనర్ అరుణ, ఏఈఆర్‌ఓ కార్వేటినగరం తహసీల్దార్ రవికుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయకృష్ణ, బీఎల్‌ఓలు పవన్‌కుమార్ (జీడీ నెల్లూరు), విజయ్ (చిత్తూరు), తులసీరామ్ (పూతలపట్టు), హేమావతి (పలమనేరు), విజయకుమార్ (కుప్పం), డేటా ఎంట్రీ ఆపరేటర్లు నిజామ్ (కుప్పం), కవిత (జీడీ నెల్లూరు), షాదిక్ (చిత్తూరు), కందస్వామి (గంగవరం)కి అవార్డులు అందజేయనున్నారు.

పంట నష్టపరిహారం చెల్లిస్తాం



రైతులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ

పులిచెర్ల(కల్లూరు): ఏనుగుల దాడులతో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించడం జరుగుతుందని చిత్తూరు డీఎఫ్‌ఓ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని దేశిరెడ్డిగారిపల్లెలో రైతులతో సమావేశం నిర్వహించారు. పంట నష్టం అంచనాలను తయారు చేయమని చెప్పడం జరిగిందని, త్వరలోనే పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసరు థామస్, సెక్షన్ ఆఫీసరు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశ్వంలో ఉచిత సైనిక్ మోడల్ టెస్ట్ రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం విద్యాసంస్థలో ఈ నెల 26వ తేదీన సైనిక్ మోడల్ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన సైనిక్ విద్యాసంస్థల్లో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అనుగుణంగా మోడల్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సబ్జెక్టు పరంగా లోపాలను సరిదిద్దుకుని అసలైన పరీక్షకు సంసిద్ధం కావడానికి ఈ మోడల్ టెస్ట్ దోహదపడుతుందని తెలిపారు. ఈ ఉచిత మోడల్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్(అడ్మిట్ కార్డు) జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కుక్కలదాడిలో జింక మృతి



మృతి చెందిన జింక

గుడిపాల: కుక్కల దాడిలో ఓ జింక మృతిచెందింది. గుడిపాల మండలంలోని నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలో బుధవారం ఓ జింకను కుక్కలు వెంటాడాయి. స్థానికులు చూసి కుక్కలను బెదరగొట్టినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే కుక్కలు మూకుమ్మడిగా జింకపై దాడి చేశాయి. స్థానికులు వెళ్లి చూడగా జింక మృతి చెందింది. వెంటనే అటవీశాఖ బీట్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డికి సమాచారం అందించారు. బొమ్మసముద్రం వెటర్నరీ అధికారి రవితేజ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి జింక మృతదేహాన్ని ఖననం చేశారు.

ఆడపిల్లలు లేని సమాజం అనాథతో సమానం

- ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం.. ఇదే ప్రతి పౌరుడి నినాదం
- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కరుణకుమార్
- పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం
- పోటీల్లో గెలుపొందిన బాలికలకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : ఆడపిల్లలు లేని సమాజం అనాథతో సమానమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డా.కరుణకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న అసమానతల పట్ల మాట్లడడం, ఆడపిల్లలకు వారి హక్కులపై అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. బాలికా విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాలికల ఉజ్వల భవిష్యత్ పట్ల చర్చించడం తదితర లక్ష్యాలతో ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ అని చెప్పారు. ఆడపిల్లల పట్ల వివక్ష ఉండకూడదని తెలిపారు. భ్రూణహత్యలు, శిశుహత్యలు, ఆడపిల్లలను భారంగా చూడడం సరికాదన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతుకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం.. ఇదే ప్రతి పౌరుడి నినాదం కావాలని పిలుపునిచ్చారు. పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ ఎలాంటి హింస, వివక్ష, వేధింపులు లేని సమాజమే ఆడపిల్లల కల అని అన్నారు. బాల్యవివాహాలు బాలికల పట్ల శాపంగా మారుతున్నట్లు తెలిపారు. తరాలు మారుతున్నా, నేటికీ పలుచోట్ల బాల్యవివాహాలు జరగడం బాధాకరమన్నారు. బాలికల రక్షణకు హక్కులు, చట్టాలు ఉన్నట్లు తెలిపారు. వాటిపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు వ్యాస, వకృత్వ, డ్రాయింగ్ పలు పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవిరాజు, డెమో జయరాముడు పాల్గొన్నారు.

డైరెక్టర్ ఆకుల శివ తల్లికి మంత్రుల నివాళి



మునిలక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రులు నారాయణస్వామి, ఆర్కే రోజా

కార్వేటినగరం: ప్రముఖ సినీ డైరెక్టర్, రచయిత ఆకుల శివ తల్లి ఆకుల మునిలక్ష్మమ్మ(92)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆకుల శివ స్వగ్రామం సీడీ కండ్రిగ గ్రామంలో జరిగిన శుభ స్వీకరణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర పర్యాటక శాఖ, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆకుల శివ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన తల్లి శుభ స్వీకరణ కార్యక్రమాన్ని ఆకుల శివ సుమారు 35 మంది బ్రాహ్మణోత్తములతో జరిపించారు. వేద పండితులకు గోదానం, వస్త్రదానం చేశారు. అలాగే ప్రముఖ సినీ డైరెక్టర్ వీవీ వినాయక్, ఇతర ప్రముఖులు కూడా మునిలక్ష్మమ్మకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఆకుల శివ తండ్రి ఆకుల సుబ్రమణ్యంశెట్టి గతంలో 30 ఏళ్లుగా సర్పంచ్‌గా ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులు నేటికీ ప్రజా ప్రతినిధులుగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, సుబ్రమణ్యం స్వామి ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి, సర్పంచ్ గోవిందమ్మ, మునెయ్య, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ నాయకుడు యువరాజు, జిల్లా కాంగ్రెస్ డీసీసీబీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, బలిజ సంఘం నాయకుడు గోపిరాయులు, చిత్తూరు బలిజ సంఘం అధ్య క్షుడు ఓ.ఎం రామదాసు, చిరంజీవి ఫ్యాన్స్ యువత అధ్యక్షుడు పూల ప్రభాకర్, కేఎస్ఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు లోకనాథ నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంకు చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు, యువకులు బుధవారం చెల్దిగానిపల్లి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. కుప్పంలో భరత్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో మహేష్, నరేంద్ర, మునిరాజ్, ముత్తు, భరత్, ఇంతియాజ్, నదీమ్, గణేష్, గోపి, శ్రీకాంత్, షంషేర్ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, నాయకుడు మధుసూదన్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్ప, సిద్ధప్ప, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా పాల్గొన్నారు.

మంత్రి రోజాపై కౌన్సిలర్ ఆరోపణలు అవాస్తవం

- పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి



మాట్లాడుతున్న పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి

తిరుపతి కల్చరల్: మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం మంత్రి ఆర్కే రోజా రూ.లక్షలు తీసుకున్నారని కౌన్సిలర్ భువనేశ్వరి చేసిన ఆరోపణలు అవాస్తవమని, దీన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సీఎం జగనన్న ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఓసీ రిజర్వేషన్ స్థానంలో ఒక దళితుడైన తనను మున్సిపల్ ఛైర్మన్‌ను చేసిన ఘనత మంత్రి ఆర్కే రోజాకే దక్కుతుందన్నారు. అంతేకాక కరోనాలో సైతం 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి కాపాడిన గొప్ప వ్యక్తి మంత్రి రోజా అన్నారు. ఆర్కే రోజా ట్రస్టు ద్వారా రూ.1.50 కోట్లు ఖర్చు చేసి, పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలను పూర్తిగా విస్మరించి హైదరాబాద్‌లో కూర్చున్న చరిత్ర చంద్రబాబు, లోకేష్‌లదేనన్నారు. మంత్రికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ కుట్రలతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ శంకర్ మాట్లాడుతూ మంత్రి రోజాకు రూ.లక్షలు ఇచ్చానని చెబుతున్న భువనేశ్వరి మూడేళ్లుగా ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. బాధితుడు వైఎస్సార్ సీపీ నేత సత్యం మాట్లాడుతూ సొంత లావాదేవీల్లో భాగంగా భూమి కొనుగోలు నిమిత్తం భువనేశ్వరి వద్ద తాను రూ.29 లక్షలు తీసుకున్న మాట వాస్తవమేనన్నారు. ఇందులో రూ.13 లక్షలు తిరిగి ఇచ్చేశానని, ఇంకా రూ.16 లక్షలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. డబ్బులు సర్దడం ఆలస్యం కావడంతో ఇవ్వలేకపోయాయన్నారు. అయితే ఈ విషయంపై మంత్రి రోజా కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తూ ఛైర్మన్ పదవి కోసం ఇచ్చానని చెప్పడం దుర్మార్గమన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు టి.ఏకాంబరం, చిట్టిబాబు, గుణ, మునిరత్నం, జేసీఎస్ కన్వీనర్ కె.ఏకాంబరం, ఈశ్వర్ యాదవ్, చక్రి పాల్గొన్నారు.

చిత్తూరులో రూ.3 లక్షల నగదు చోరీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని హై రోడ్డులో ఉన్న ఓ దుకాణంలో చోరీ జరిగింది. నగరానికి చెందిన పృథ్వీరాజ్ అనే వ్యక్తి హై రోడ్డులో ప్రైవేటు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ కేంద్రం నడుపుతున్నాడు. యథావిధిగా బుధవారం ఉదయం దుకాణం తెరిచి లోపల చూడగా కిటికీ పగలగొట్టి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు క్యాష్ కౌంటర్లో ఉంచిన దాదాపు రూ.3 లక్షలకు పైగా నగదును చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల ఇంటి పట్టాల పంపిణీపై కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టుల ఇళ్ల పట్టాల పంపిణీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర సమాచార శాఖ నుంచి జిల్లాకు ప్రాథమిక వెరిఫికేషన్ మేరకు 311 మంది జర్నలిస్టుల జాబితా అందిందన్నారు. ఆ ప్రకారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం, వి.కోట, చౌడేపల్లి, పుంగనూరులో గుర్తించే భూముల ఎఫ్ఎంబీలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ రాజశేఖర్, జిల్లా సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్లు, డీపీఆర్ఓ పద్మజ, కమిటీ సభ్యులు సహదేవ,తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జయమ్మ

పుంగనూరు: మండలంలో వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందిన సంఘటనలు బుధవారం వెలుగు చూశాయి. మండలంలోని నేతిగుట్లపల్లెకు చెందిన ఆశా వర్కర్ జయమ్మ(35)మంగళవారం రాత్రి పుంగనూరులో బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లి తిరిగి ఆటోలో బంధువులతో కలిసి వెళ్తుండగా సుగాలిమిట్ట వద్ద అర్ధరాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయమ్మను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వేకువజామున ఆమె మృతి చెందింది. అలాగే మండలంలోని గూడూరుపల్లెకు చెందిన మునెప్ప కుమారుడు విజయకుమార్ (13) 8వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈమేరకు పోలీసులు కేసులు నమోదు చేసి శవాలను పోస్టు మార్టంకు ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో మంగళవారం రాత్రి జి.అరుణ్ కుమార్ (32) అనే యువకుడు ఒక బాలికపై అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంటనే నిందితుడి కోసం గాలింపు చేపట్టిన ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసంతి బుధవారం నిందితుడి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. దీనిపై జూనియర్ సివిల్‌జడ్జి విష్ణువర్మ నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించగా కోర్టు కానిస్టేబుల్ నవీన్ నిందితుడిని చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

కూలీల కోసం వెళ్తూ..

చౌడేపల్లె: పొలంలో వరినాట్లు వేసేందుకు కూలీలను పిలిచేందుకు వెళ్తూ ఓ రైతు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. చిట్రెడ్డిపల్లెకు చెందిన సీతన్న(62) వరి నాట్లు వేసేందుకు కూలీలను పిలిచేందుకు బుధవారం రాత్రి స్కూటీలో శెట్టిపేటకు బయలుదేరాడు. అయితే రాగిమాన్లు వద్ద స్కూటీ అదుపుతప్పి కిందకు పడ్డారు. అపస్మార స్థితిలో పడి ఉన్న సీతన్నను స్థానికులు గుర్తించి చౌడేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్త, వదినపై కత్తితో దాడి

చిత్తూరు అర్బన్: నగరంలోని శంకరయ్య గుంటలో బుధవారం రాత్రి జరిగిన దాడిలో హురాన్, సల్మా అనే ఇద్దరు మహిళలు గాయపడ్డారు. టూటౌన్ సీఐ ఉలసప్ప కథనం మేరకు.. నూర్ అనే వ్యక్తి ఓ చికెన్ షాపులో పనిచేస్తూ తన భార్య హసీనాతో కలిసి శంకరయ్యగుంటలో కాపురం ఉంటున్నాడు. బుధవారం రాత్రి తనను కొడుతున్నాడంటూ హసీనా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. హసీనా తల్లి హురాన్, పెద్దకుమార్తె సల్మా శంకరయ్య గుంటకు వెళ్లి ఇద్దరినీ విడిపించే ప్రయత్నం చేశారు. తన కుటుంబంలో గొడవ జరుగుతుంటే ఎందుకు అడ్డు వస్తున్నారంటూ ఆగ్రహించిన నూర్ కత్తి తీసుకుని అత్త, వదినపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఇద్దరు మహిళలకు గొంతు వద్ద తెగడంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు కోలుకుంటున్నారు. అయితే సల్మా హోంగార్డుగా పనిచేస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజయవంతంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



సమీక్షలో మాట్లాడుతున్న సచీంద్రకుమార్ పట్నాయక్

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభించారని జిల్లా ప్రత్యేక అధికారి, పరిశీలకులు సచీంద్రకుమార్ పట్నాయక్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్రను విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 2023 నవంబర్ 25న ఈ కార్యక్రమాన్ని జిల్లాకేంద్రం నుంచి ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 646 గ్రామ పంచాయతీలలో సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పించినట్లు వివరించారు. మిగిలిన 51 పంచాయతీల్లో ఈనెల 30 లోపు సంకల్ప యాత్రను పూర్తి చేస్తా మన్నారు. జిల్లాలో వికసిత భారత సంకల్ప యాత్ర ను జిల్లా యంత్రాంగంతో పాటు జెడ్పీ సీఈఓ సంబంధిత జిల్లా, మండలస్థాయి అధికారులను సమన్వయం చేసుకుని విజయవంతంగా నిర్వహించారన్నారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి 4,75,170 కార్డులకు ఈకేవైసీ పూర్తి చేసినట్లు చెప్పారు. పీఎం ఆవాస్ యోజన పథకంలో జిల్లాకు మంజూరైన 73,584 గృహాలకు గాను 45,256 ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పీఎం పోషణ అభియాన్ పథకంలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 7 నెలల నుంచి మూడేళ్ల వయసు గల 57,184 మంది పిల్లలకు, 3-6 ఏళ్ల వయసు గల 28,192 మంది పిల్లలకు, 1139 మంది గర్భిణులకు, 10,964 మంది బాలింతలకు లబ్ధి చేకూరుతోందన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్ఓ రాజశేఖర్, నోడల్ అధికారి ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ, హౌసింగ్, డ్వామా పీడీలు తులసి, పద్మనాభం, గంగాభవానీ, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీపీఓ లక్ష్మి, డీఎస్ఓ శంకరన్, డీఎల్‌డీఓ రవికుమార్, జీఎం డీఐసీ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, డీఈఓ విజయేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్

- టీడీపీ ఇన్‌చార్జి భూముల్లో ప్లాట్లు
- నిబంధనలకు నీళ్లు
- నీటి పారుదల కాలువ పూడ్చివేత



టీడీపీ ఇన్‌చార్జ్ భూముల్లో అక్రమంగా వేసిన లేఅవుట్

కుప్పం: నీటి పారుదల కాలువను పూడ్చివేసి పంచాయతీ నింబంధనలకు గాలికి వదిలి అక్రమ లేఅవుట్ వేసి, ప్లాట్లు విక్రయించి టీడీపీ నేతలు లాభార్జన గడిస్తున్నారు. పల్లపు ప్రాంతంగా ఉన్నా భూమిని చదును చేసేందుకు చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి, లే అవుట్‌లలోకి తరలించారు. లేఅవుట్‌కు అడ్డంగా ఉందని ఏళ్లనాటి కాలువను పూడ్చివేశారు.

గుడుపల్లె మండలం గుండ్లసాగరం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 92లో టీడీపీ ఇన్‌చారజ్ పీఎస్ మునిరత్నం, మరో టీడీపీ నాయకుడు గోపీనాథ్ పేరిట రెండు ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల కాలంలో పక్కనే నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మించింది. దీంతో ఈ చుట్టు పక్కల భూముల విలువ పెరిగింది. ఈ విషయం గుర్తించిన టీడీపీ నాయకులు తమ వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధమయ్యారు. రెండు ఎకరాల భూమి చదును చేసి లే అవుట్‌గా తీర్చిదిద్దారు.

కాలువను పూడ్చి వేసి...

సర్వే నంబర్ 92 చుట్టూ గుట్టలు ఉన్నాయి. సర్వే నంబర్ 80 లోనూ సుమారు 50 ఎకరాల గుట్ట, వ్యవసాయ భూములు ఉన్నాయి. వర్షాకాలంలో భారీగా వర్షాలు వస్తే నీటి ప్రవాహం కోసం సర్వే 80 నుంచి 92 వరకు వర్షపు నీరు ప్రవహించేందుకు కాలువ ఉండేది. ప్రస్తుతం లేఅవుట్ ఏర్పాటు కోసం రెండు ఎకరాల్లో ఉన్న కాలువను టీడీపీ నేతలు పూడ్చి వేశారు. రాబోయే రోజుల్లో వర్షాలు వస్తే నీటి ప్రవాహం పంట పొలాలపైకి, చుట్టు పక్కల ఉన్న నివాస గృహాల్లోకి ప్రవహించే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు నీళ్లు

వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేయాలంటే పంచాయతీ కార్యాలయంలో కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం లేఅవుట్ ఏర్పాటుకు పంచాయతీ అధికారులను సంప్రదించి, రోడ్లు, డ్రైనేజ్ కాలువ, సామాజిక అవసరాలకు 10 శాతం స్థలం కేటాయించాలి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా లే అవుట్‌లు వేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇలాంటి లే అవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే, వర్షాకాలంలో ముంపునకు గురై, ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

వర్షపునీటి కాలువను పూడ్చి వేసి, లే అవుట్ వేయడం నేరం. ఈ విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. స్థానికంగా వీఆర్వోలను సంప్రదించి, కాలువ పూడికను తీసివేయిస్తాం. దీనిపై శాఖ పరమైనా చర్యలు తీసుకుంటాం.

-గురప్ప, తహసీల్దార్, గుడుపల్లె